అనధికార కోతలు.. ప్రజలకు అవస్థలు

- రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా..
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సిబ్బంది నిర్లక్ష్యం


నగరంలోని విద్యుత్ భవన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గంటల తరబడి రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య నగరంలోని పలు ప్రాంతాల్లో ఉంది. ప్రధానంగా నగరంలోని 54వ డివిజన్ పరిధిలో పేద, మధ్య తరగతి ప్రజలు అధిక సంఖ్యలో నివాసం ఉంటున్నారు. భగత్‌సింగ్ కాలనీ, టిడ్కో అపార్ట్‌మెంట్లలో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఆయా సందర్భాల్లో సరఫరాను పునరుద్ధరించేందుకు 12 నుంచి 15 గంటల సమయం పడుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గత వారంలో కూడా..

గత ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో టిట్కో గృహ సముదాయంలోని ఓ అపార్టుమెంట్‌లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు సంబంధిత సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే వారు సకాలంలో స్పందించకపోవడంతో మరుసటిరోజు సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. దీంతో అపార్ట్‌మెంట్‌లోని ప్రజలు 15 గంటల పాటు విద్యుత్ లేక అగచాట్లు పడాల్సి వచ్చింది.

తక్షణమే స్పందించాలి

పది రోజుల క్రితం భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో రాత్రి 11 గంటలకు కరెంట్‌పోతే మరుసటి రోజు మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. దీనిని బట్టేట్ చూస్తే విద్యుత్ సిబ్బంది వినియోగదారుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. నెలకు రూ.వేలల్లో జీతాలు తీసుకుంటూ విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే నిత్యం కరెంట్ లేని రాత్రులు గడపాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలిగిన సందర్భంలో తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీ4 ఎంపికకు అధికారులు కృషి చేయాలి


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరురూరల్: సమాజంలోని అట్టడుగు వర్గాలను పైకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన పీ4 పథకంలో మార్గదర్శుల ఎంపికకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పీ4 పురోగతి గురించి అధికారులతో జేసీ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న రాష్ట్ర స్థాయిలో పీ4 పథకాన్ని ఆవిష్కరిస్తున్నందున, అధికారులందరూ మార్గదర్శుల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పీ4 ఉద్దేశాల గురించి విస్తృతంగా చర్చ జరిగినప్పుడే మార్గదర్శకులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి


వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరురూరల్: నగరంలోని ఆర్ఎన్నార్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో హేమశ్రీ అనే విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి షారూక్, కమిటీ సభ్యులు నవీన్ హర్ష, పూజిత్, చరణ్ పాల్గొన్నారు.

లాఠీచార్జ్ చేసిన వారిపై చర్యలకు డిమాండ్

యువజన సంఘం నాయకులపై లాఠీచార్జ్ చేపట్టిన ఐదో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వి.నరేంద్ర, ఎన్వీ రమణ, షేక్ మస్తాన్‌లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆర్ఎన్నార్ కళాశాలను సీజ్ చేయాలన్నారు. అక్కడి హాస్టల్ విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలన్నారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు


పాఠశాలల్లో వసతుల వివరాలను తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

నెల్లూరు (టౌన్): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి నగరంలోని 13 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్థానిక మూలాపేటలోని ఏనుగు సుందరరామిరెడ్డి నగరపాలక పాఠశాల, జెండావీధిలోని పెండ్యాల నారాయణమ్మ బాలికోన్నత పాఠశాల, సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, రంగనాయుకులపేటలోని పీఎంఆర్ నగరపాలక పాఠశాల, జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని నగరపాలక ఉన్నత పాఠశాల, శెట్టిగుంటరోడ్డులోని యడ్లపల్లి వెంకటేశ్వర్లు ఉన్నత పాఠశాల, నవాబుపేటలోని బీవీఎస్ నగరపాలక పాఠశాలలను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పీ4లో భాగంగా పాఠశాలలను ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు రూ.165 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 15 లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నారని, రానున్న నాలుగేళ్లలో వారి అభివృద్ధి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీ4లో భాగస్వాములు కావాలి

నెల్లూరు(బృందావనం): ఆర్థికంగా స్థిరపడిన వారు పీ4లో భాగస్వాములు కావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మూలాపేటలో జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ హైస్కూల్స్ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, టీడీపీ నేతలు తాళ్లపాక అనూరాధ, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం ఆక్రమణకు టీడీపీ నేత యత్నం

- విచారించి న్యాయం చేయాలని వినతి


తహసీల్దార్‌కు పొలం పత్రాలు చూపుతూ సమస్యను వివరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం మజరా టపాతోపులో 131–1, 131–2, 133–బి సర్వే నంబర్‌లోని 2.19 ఎకరాల మాగాణి భూమిని నార్తురాజుపాళేనికి చెందిన టీడీపీ నేత తువ్వర ప్రవీణ్‌కుమార్ ఈనెల 7న ఆక్రమించేందుకు యత్నించారని ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియలు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి సోమవారం విన్నవించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ టపాతోపులో వీరి వాణికి 2.19 ఎకరాల పట్టా పొలముందన్నారు. ఈ భూమిపై కన్నేసిన టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ పొలం యజమాని గ్రామంలో లేదని తెలుసుకుని ఈనెల 7న ఆక్రమణకు యత్నించారని చెప్పారు. పొలంలో జేసీబీలను పెట్టి మట్టి తీస్తుండగా యజమాని కారు డ్రైవర్ కళాధర్ గుర్తించి అతన్ని ప్రశ్నించారన్నారు. దీంతో కోపోద్రేక్తుడైన ప్రవీణ్‌కుమార్ దుర్భాషలాడడంతో పాటు పోలీసులకు కళాధర్‌పై ఫిర్యాదు చేశారని చెప్పారు. అధికార పార్టీ అండతో పట్టా పొలాన్ని సైతం ప్రవీణ్‌కుమార్ ఆక్రమిస్తున్నారని తెలుపుతూ పొలానికి సంబంధించిన పాసు పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను చూపారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ సమాధానమిస్తూ విచారించి తగిన చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

నాపై తప్పుడు కేసు పెట్టారు

- కార్పొరేటర్ పేనేటి సుధాకర్

నెల్లూరు సిటీ: తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినందుకు, టీడీపీ నాయకులు తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని రూరల్ నియోజకవర్గంలోని 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సోషల్ మీడియా ద్వారా తన ఆవేదనను వ్యక్తం చేశారు. తాను దాడి చేసినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ నాపై కేసు నమోదు చేశారన్నారు. పార్టీ మారినందుకు వ్యక్తిగతంగా టార్గెట్ చేసి తప్పుడు కేసు పెట్టారని వాపోయారు. స్థానిక నేతలతో ఏర్పడిన విభేదాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ మారానే తప్ప రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో ఎటువంటి విభేదాలు లేవన్నారు. నా ఆర్థిక వనరులను దెబ్బకొట్టడం తగదన్నారు. తనకు రాజకీయంగా అవకాశం ఇచ్చిన ఇష్టమైన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిల మీద నమ్మకంతో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి తిరిగి వచ్చినట్లు వివరించారు.

విద్యార్థి సంఘాలపై లాఠీచార్జ్ దారుణం

నెల్లూరు (టౌన్): ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ఘటనపై స్థానిక ఇస్కాన్‌నగర్‌లోని ఆర్ఎన్నార్ జూనియర్ కళాశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమని ఏపీ విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఆదిత్యసాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదిశంకర ధ్యాన మందిరంలో 'సత్సంగం' నేడు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో శ్రావణ బహుళ తదియను పురస్కరించుకుని బేలూరు మఠం రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు సత్సంగం జరుగనుందని మందిర మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు. నెల్లూరుశాఖ కార్యదర్శి హృదానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తొలుత చిన్నారులచే సాయంత్రం 5.30 గంటలకు సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు.

గాయపడిన ఏసీ మెకానిక్ మృతి

నెల్లూరు(క్రైమ్): తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మరణించారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు ఇందిరానగర్‌లో ఏసీ మెకానిక్ లతీఫ్(34) నివాసం ఉంటున్నారు. ఈనెల 8వ తేదీన ఆయన తన అన్న సలీమ్‌తో కలిసి హరనాథపురంలోని ఓ ఇంట్లో ఏసీ ఇన్‌స్టలేషన్‌కు వెళ్లారు. మూడో అంతస్తులో కంప్రెషర్ బిగించే క్రమంలో లతీఫ్ కాలుజారి పక్క మిద్దె టెర్రస్‌పై పడడంతో తల, చాతీకి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని సలీమ్ హుటాహుటిన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం లతీఫ్ మృతిచెందారు. ఈ మేరకు మృతుని బంధువు పర్వేజ్ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలసదన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(పొగతోట): నెల్లూరు, కందుకూరు బాలసదన్‌లో ఖాళీగా ఉన్న హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్, హౌస్‌కీపర్, ఎడ్యుకేటర్, పీటీ కమ్ యోగా టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నమని ఐసీపీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనుసుజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): పీజీఆర్ఎస్‌లో అందే ఫిర్యాదులపై అశ్రద్ధ వద్దని, ప్రజలు సంతృప్తి చెందేలా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి కమిషనర్ నందన్ 33 ఫిర్యాదులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లాలని తెలిపారు. అర్జీల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా 33 ఫిర్యాదులు అందాయని, ఇందులో ఇంజినీరింగ్–9, హౌసింగ్–8, టౌన్‌ప్లానింగ్–10, రెవెన్యూ–2, పబ్లిక్ హెల్త్– 3, ఆప్కాస్–1 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, సిటీప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఏసీపీ వేణు, రెవెన్యూ అధికారులు సమ్మద్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు


ఎస్ఈ రామ్మోహన్‌రావుకు అర్జీ అందజేస్తున్న కార్పొరేటర్ సత్తార్

నెల్లూరు(బారకాసు): 29వ డివిజన్‌లోని నగరపాలక సంస్థ పాఠశాల ప్రాంగణం చిన్నపాటి వర్షానికే రొచ్చురొచ్చుగా మారుతోందని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నారని సుందరంగా తీర్చిదిద్దాలని ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్.సత్తార్ ఎస్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎస్ఈ రామ్మోహన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ తమ డివిజన్‌లోని నగరపాలక పాఠశాల ప్రాంగణం చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరుతోంది. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో మట్టి తోలించి లెవలింగ్ చేయించాలని, నీరు నిల్వ లేకుండా తీర్చిదిద్దాలని కోరారు. నిస్సార్, జుబేర్‌బాయ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన జేసీ కార్తీక్, డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని యువత హెచ్ఐవీ, డ్రగ్ అడిక్షన్‌కు దూరంగా ఉండేలా వైద్యశాఖ అధికారులు ప్రజల్లో ప్రచార కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకుని రావాలని జేసీ కార్తీక్ సూచించారు. హెచ్ఐవీ, మత్తు పదార్థాలు, సుఖ వ్యాధులపై ప్రజలను చైతన్యం చేసేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఇన్‌టెన్సిఫైడ్ ఐఈసీ ప్రచార వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో జేసీ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రచార కార్యక్రమం జిల్లాలో రెండు నెలల పాటు జరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, ఎయిడ్స్ నివారణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ


నెల్లూరు(అర్బన్): నగరంలోని రెయిన్‌బో హాస్పిటల్, శ్రీరామ్‌మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, అపెక్స్ క్లినిక్ తదితర పలు ఆస్పత్రుల్లో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రులకు సంబంధించిన వివిధ రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, స్కానింగ్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం తప్పనిసరిగా పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజీ అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలు, వాటి ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. ఓపీ, ఐపీ రిజిస్టర్లతో పాటు కేస్‌షీటులు పక్కాగా ఉండాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు టీబీకి సంబంధించిన రోగులు వస్తే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ సిబ్బంది తులసీరామ్, హరీష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నెల్లూరు(బారకాసు): జిల్లాలోని ప్రజలందరూ దేశభక్తి ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా – హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన హర్ ఘర్ తిరంగా.. హర్ ఘర్ స్వచ్ఛత ర్యాలీని జేసీ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. వీఆర్సీ నుంచి గాంధీ బొమ్మ వరకు ప్రజలందరూ స్వచ్ఛమైన భారతదేశం కోసం తమ వంతు కృషి చేయాలనే నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ రక్షణతో పాటు దేశ పరిశుభ్రత ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈనెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా.. హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పూజితకు కొండ్రెడ్డి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకాణి పూజితారెడ్డి నియమితులైన నేపథ్యంలో నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సోమవారం అభినందించారు. ఈ మేరకు ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ నాయకులు పాశం శ్రీనివాస్, ఏసునాయుడు, కొండేటి నరసింహారావు, స్వర్ణ ప్రసాద్, మొయినుద్దీన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రం అందజేత



నెల్లూరురూరల్: ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన పి.సుధాకర్ కుమారుడు రాజేష్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ సోమవారం డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ నియామక పత్రం అందజేశారు. పశుసంవర్ధకశాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా రాజేష్‌కు ఉద్యోగం కల్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

డీఎస్సీ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): డీఎస్సీ ఫలితాలను విడుదల చేసినట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించిన సవరించిన తుది కీ ఆధారంగా డీఎస్సీ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తుది ఫలితాలు, స్కోర్ కార్డులను పొందవచ్చన్నారు. టెట్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వెబ్‌సైట్ https://apdsc.apcfss.inలో హాల్ టికెట్ నంబరు ఎంటర్ చేస్తే తమకు తామే టెట్ వివరాలు సరిచేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశం రెండు రోజులు పాటు ఉంటుందన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇస్కపాళెంలో జరిగింది. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఇస్కపాళెం గ్రామానికి చెందిన కల్లిరెడ్డి బాలయ్య (36) ఆదివారం తన నివాసంలో గడ్డిమందు తాగి కేకలు వేయడంతో బంధువులు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. బాలయ్య భార్య మంజుల మూడేళ్ల క్రితం చనిపోయింది. మనోవేదనకు గురై బాలయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అతనికి మహిధర్, శశిధర్ అనే ఇద్దరు కుమారులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి




బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద కాలువలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 45 ఏళ్ల వ్యక్తి కాలువలో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 91828 48516, 94407 96330 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఎస్ఈఐఎల్‌కు ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికెట్


సర్టిఫికెట్ స్వీకరించిన సీఈఓ

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ అడ్మిన్ బిల్డింగ్‌కు ప్రతిష్టాత్మక ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికెట్ లభించినట్టు కంపెనీ సీఈఓ జనమేజయ మహాపాత్ర సోమవారం తెలిపారు. స్థిరత్వం, పర్యావరణ నిర్వహణపై నిబద్ధత వల్లే విజయవాడలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ ఆంధ్రా సమ్మిట్ – 2025లో ఐజీబీసీ ప్లాటినం సర్టిఫికెట్‌ను ప్రదానం చేసినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఐజీబీసీ సమ్మిట్‌ను నిర్వహించినట్టు వెల్లడించారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించండి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై సిబ్బంది దృష్టి సారించాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్యాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అదనపు అంతస్తులకు పన్ను విధించి, ఖాళీ స్థలాల పన్నులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. తాగునీటి కుళాయిలను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.